సాక్షి జనగామ

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



పట్టపగలు భారీ చోరీ

పట్టణ పరిధి వాసవీకాలనీ ఫేజ్-2లోని ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇంటిలో పట్టపగలు చోరీ జరిగింది. 9 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు పోయింది. - 8లో▸



తేనెలొలుకు..తెలుగు భాష

దేశ భాషలందు తెలుగు భాష గొప్పతనం మరే భాషలో లేదు. నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - 8లో▸

గరిష్టం/కనిష్టం $37^0/17^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత కొంత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో ఖండాంతర ఖ్యాతి పొందొచ్చు



నర్మెట: యువత విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఖండాంతర ఖ్యాతి పొందవచ్చని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఎర్రోళ్ల కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి సహకారంతో మచ్చుపహాడ్ స్పోర్ట్స్ యూత్ ఆధ్వర్యంలో కీ.శే.పెద్ది సంజీవరెడ్డి స్మారక ఉమ్మడి వరంగల్, సిద్దిపేట జిల్లాల కబడ్డీ పోటీల కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 24 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే ఈ క్రీడాపోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రామిని శివరాజ్ కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడు లింగాల పరశురాములు, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి రాజశేఖర్, కోశాధికారి ఆర్.రాజశేఖర్, మంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరిపెల్లి కీర్తనకు సీపీ అభినందన



పాలకుర్తి/పాలకుర్తిటౌన్: ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌లో 2వేల మీటర్ల రన్నింగ్ ట్రిపుల్ చేజ్‌లో రజత పతకం సాధించిన మండల పరిధి గూడూరుకు చెందిన చెరిపెల్లి కీర్తనను వరంగల్ సీపీ రంగనాథ్ అభినందించి సన్మానించారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంద కొమురయ్య, ఎంపీటీసీ రాజేశ్వరి, కీర్తన తండ్రి చెరిపెల్లి కుమారస్వామి, మాజీ సర్పంచ్ పుల్లయ్య, అనుముల మహేందర్, మంద సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీడీఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: ఎస్ఎచ్‌డీపీ, సీడీపీ పథకం కింద క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో మూడేళ్ల కాలపరిమితితో పనిచేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత జౌళిశాఖ సంచాలకులు చౌడీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం 'కొండా లక్ష్మణ్ బాపూజీ' రాష్ట్ర అవార్డుకు ఔత్సాహికులు ఏప్రిల్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వయసు 30 ఏళ్లపైన, 10 ఏళ్ల అనుభవం ఉండాలని, అవార్డు కింద రూ.25వేల నగదు అందజేస్తారని తెలిపారు.

హెచ్‌ఆర్‌సీ క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ: సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ రూపొందించిన-2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏసీపీ దేవేందేర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ బానోత్ అరుణ్‌కుమార్, సౌత్ ఇండియా చైర్మన్ ఎండీ. నజీమొద్దీన్, వర్కింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ హన్మగౌడ్, స్టేట్ డైరెక్టర్ ఎం.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తులసి గింజలతో వివాహ ఆహ్వాన పత్రిక



జనగామ: తులసి గింజలతో రూపొందించిన వివాహ ఆహ్వాన పత్రికను గ్రీన్ జనగామ అధ్యక్షుడు కాసాల సంతోష్ సోమవారం డీసీపీ సీతారాంకు అందజేశారు. అనంతరం సంతోష్ మాట్లాడుతూ తులసి గింజలతో తీర్చిదిద్దిన పెళ్లి పత్రిక గురించి 'సాక్షి' దినపత్రికలో ప్రచురించారని, దానిని చూసి నిజామాబాద్‌కు చెందిన మంచాల జ్ఞానేందర్‌గుప్తా తన కూతురు డాక్టర్ శర్వణ్వీ వివాహ ఆహ్వాన పత్రికను తయారు చేయించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలనే ఉద్దేశంతో ఆహ్వాన పత్రికను డీసీపీకి అందజేసినట్లు చెప్పారు. ఆయన వెంట గట్టు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కష్టాలు తీర్చండి సారూ..

- గ్రీవెన్స్‌లో అర్జీదారుల గోడు
- వివిధ సమస్యలపై 50 అర్జీలు
- అధికంగా దివ్యాంగ, భూసమస్యలే..
- స్వీకరించిన కలెక్టర్, అధికారులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

జనగామ రూరల్: 'పుట్టుకతోనే రెండు కాళ్లు లేవు. మూడు చక్రాల వాహనం ఇచ్చి ఆదుకోవాలి.. కొడుకు-కోడలు ఆస్తి తీసుకుని ఇంటి నుంచి గెంటేశారు.. అంత్యోదయ కార్డు మంజూరు చేసి ఆదుకోవాలి' అంటూ సమస్యలను ఏకరువు పెట్టిన ప్రజలు తమ కష్టాలు తీర్చండి సారూ.. అంటూ అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 50 అర్జీలు రాగా.. కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర అధికారులు స్వీకరించారు. వినతులను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- జనగామలోని పలు పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ లేదని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూళ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ పౌరుడు అభినవ్ ఫిర్యాదు చేశాడు.
- వారసత్వ భూమి పట్టా మార్పిడి కాకుండా సోదరుడు అడ్డుకుంటున్నాడు.. న్యాయం చేయాలని కొడకండ్ల మండలం ఏడునూతల గ్రామానికి చెందిన ఎండీ.సర్వర్ కోరాడు.
- నేను ఒంటరి మహిళను. అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఇల్లు మంజూరు చేయాలని జనగామ పట్టణంలోని కురుమవాడకు చెందిన దడబోయిన లక్ష్మి అర్జీ పెట్టుకుంది.

దారి మూసివేశారు..



జనగామ పట్టణంలోని వెంకన్నకుంట వాటర్ ట్యాంక్ పక్కన ఉన్న దారిని ఆరేళ్ల క్రితం మూసివేసి ఇల్లు నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని కౌన్సిలర్ జక్కుల అనిత ఆధ్వర్యంలో స్థానికులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- 17 వార్డు వెంకన్నకుంట వాసులు

మూడు చక్రాల వాహనం ఇప్పించండి



పుట్టుకతోనే రెండు కాళ్లు పని చేయవు. మరొకరి సాయం లేనిదే ఇంటి నుంచి బయటకు వెళ్లలేను. అన్నింటికీ తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోంది. కిరాణం పెట్టుకుని బతుకుతాను. మూడు చక్రాల వాహనం ఇప్పించి ఆదుకోవాలి.

- కాసోజు భీష్మాచారి, గూడూరు(పాలకుర్తి)

అంత్యోదయకార్డు ఇప్పించాలి



సొంత ఇల్లు లేదు. అద్దెకు ఉంటున్నాను. భార్య 2013 సంవత్సరంలో తప్పిపోయింది. ఎవరూ లేని అనాథనయ్యాను. ఎలాంటి ఆస్తులు లేవు. బతకడం కష్టంగా ఉంది. అంత్యోదయ కార్డు ఇప్పించాలి.

- పత్తిపాక దినేష్, జనగామ

ఆర్నెళ్ల నుంచి తిరుగుతున్నా..



సర్వే నంబర్ 78లో బై నంబర్లలో ఉన్న భూమికి హద్దుల ఏర్పాటు చేయడానికి ఎంసీ తీయగా రెండు సార్లు పంచనామా చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు అధికారులు సంబంధిత పంచనామా కాపీ ఇవ్వడం లేదు. ఆరు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు.

- ఉడుగుల నర్సయ్య, భానాజీపేట(రఘునాథపల్లి)



పై ఫొటోలోని వృద్ధ దంపతుల పేరు ముస్కు సత్తయ్య, వజ్రమ్మ. వీరిది లింగాలఘణపురం మండలం బండ్లగూడెం. సత్తయ్యకు 459, 462 సర్వ నంబర్లలో 2.8 ఎకరాల భూమి ఉంది. కొడుకు తల్లిదండ్రులను భయపెట్టి భూమిని తనపేర రాయించుకున్నాడు. నాలుగు నెలల నుంచి గొడవ పెట్టి అన్నం పెట్టకుండా ఇంటి నుంచి కొడుకు, కోడలు గెంటేయడంతో దిక్కుతోచక కూతురు వద్ద తలదాచుకుంటున్నారు. ఇల్లుతో పాటు భూమి ఇప్పించి న్యాయం చేయాలని సత్తయ్య, వజ్రమ్మ కలెక్టర్‌ను వేడుకున్నారు.

25 గుంటల భూమి తగ్గింది



నా పేరుమీద 345ఇ సర్వే నంబర్‌లో 2.39 ఎకరాల భూమి ఉంది. ధరణిలో మాత్రం 25 గుంటలు తక్కువగా చూపిస్తున్నది. భూమి ఎవరి పేరుమీద ఉందో చూపడంలేదు. మొత్తం భూమిని నాపేర పట్టా చేయాలి.

- కొంపెల్లి చంద్రయ్య, మచ్చుపహాడ్(నర్మెట)

దండుపాళ్యం ముఠాగా మారారు!



సభకు హాజరైన జనం



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నిప్పులు
- కేసీఆర్, నరేంద్రమోదీల పాలనపై మండిపాటు
- వరంగల్ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు బిల్లా.. రంగాలుగా అభివర్ణన
- విద్యార్థులు, మేధావులు, కార్మిక సంఘాలతో భేటీ
- సమస్యలు అడిగి తెలుసుకున్న రేవంత్
- కాజీపేట దర్గా నుంచి ఏనుగులగడ్డ వరకు సాగిన జోడో యాత్ర

సాక్షిప్రతినిధి, వరంగల్/హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీఎం కేసీఆర్, పీఎం నరేంద్రమోదీల పాలనపై టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. అంతా దండుపాళ్యం ముఠాగా మారారని, తెలంగాణలో ప్రజల మనోభావాలు నెరవేరలేదన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం కాజీపేట దర్గా నుంచి హనుమకొండ చౌరస్తా సమీపంలో ఏనుగులగడ్డ వరకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి యాత్ర నిర్వహించారు. అనంతరం ఏనుగులగడ్డ, అమృత జంక్షన్ వద్ద డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ తదితరులతో కలిసి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వరంగల్ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు బిల్లా.. రంగాలుగా మారి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా దాస్యం ప్రణయ్‌భాస్కర్‌కు మంచి పేరుండేదని, ఆయన తమ్ముడిగా ప్రజల ముందుకు వచ్చిన వినయ్‌భాస్కర్ అన్నకు సున్నం పెట్టిండని, ఆయన కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో తెలియదని మండిపడ్డారు.

కాజీపేట దర్గా నుంచి ఏనుగులగడ్డ వరకు...

రేవంత్‌రెడ్డి యాత్ర సోమవారం సాయంత్రం కాజీపేటలో ప్రారంభమైంది. ముందుగా కాజీపేటలోని హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి హనుమకొండ కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని లా కాలేజీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మీదుగా యాత్ర సాగింది. అమరవీరుల స్థూపం(అదాలత్ జంక్షన్) నుంచి కాళోజీ విగ్రహం, ఏకశిల పార్క్, ప్రెస్‌క్లబ్, హనుమకొండ కొత్త బస్టాండ్, శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సర్కిల్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం, హనుమకొండ చౌరస్తా మీదుగా ఏనుగులగడ్డ వరకు సాగింది. ఈ సందర్భంగా తనను కలిసిన విద్యార్థులు, యువకులు, మేధావులు, అడ్వకేట్స్ జేఏసీ, కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులతో మాట్లాడారు. ఆటో రిక్షా కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క, అంజన్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మల్లు రవి, ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం.. సీఎం.. । అంటూ నినాదాలు...

భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో ఏనుగులగడ్డ ప్రాంతం కిక్కిరిసిపోయింది. రేవంత్‌రెడ్డి సీఎం.. సీఎం అంటూ యువత పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డప్పుచప్పుళ్లు, బోనాలతో మహిళలు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. కాంగ్రెస్ ఎజెండా, సోనియాగాంధీ త్యాగాలు, రేవంత్‌రెడ్డి ధైర్యసాహసాలను గుర్తుచేస్తూ కళాకారుల ఆటపాటలు కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపాయి.

ప్రతిపక్షాలవి సిగ్గుమాలిన వ్యాఖ్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతిపక్షాల నాయకులు ప్రజల మద్దతు లేకుండా పాదయాత్రలు చేస్తూ సిగ్గుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాల నేతలు కేవలం బీఆర్ఎస్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలను తిట్టడమే లక్ష్యంగా పాదయాత్రలు, సభలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాలంటే బాధ్యతగా పనిచేయాలి.. ప్రజాసమస్యల ఎజెండాతో ముందుకు పోవాలి.. మహానేత వైఎస్సార్ ప్రజామద్దతుతో పాదయాత్ర చేశారని గుర్తు చేసిన ఎమ్మెల్యే రాజయ్య.. ప్రస్తుత ప్రతిపక్షాలు కార్యాచరణ లేకుండా యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలతో పని లేకుండా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని పేర్కొన్నారు. భూదందాలు, సెటిల్‌మెంట్లు లేని నియోజకవర్గం స్టేషన్‌ఘన్‌పూర్ అని, అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబు ఏజెంట్‌లా వ్యాఖ్యలు చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, జఫర్‌గఢ్ జెడ్పీటీసీ ఇల్లందుల బేబీ, ఎంపీపీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నియంత పాలనకు చరమగీతం పాడాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విద్యాసాగర్‌రెడ్డి



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రెడ్డి

నర్మెట: సీఎం కేసీఆర్ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.విద్యాసాగర్ రెడ్డి అన్నారు. 'ప్రజాగోస-బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా మచ్చుపహాడ్, కన్నెబోయినగూడెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన మాట్లాడారు. మహిళల ఆత్మ గౌరవం కాపాడే దిశగా 'స్వచ్ఛభారత్' పేరుతో కేంద్ర సర్కారు ఇంటికో మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టిందన్నారు. పేద మహిళలకు ఉచితంగా వంటగ్యాస్, ఆడపిల్లలకు సుకన్య సమృద్ధియోజన లాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. మూతపడిన రామగుండం యూరియా ఉత్పత్తి కేంద్రాన్ని పునఃప్రారంభించి జాతికి అంకితం చేసిన మోదీ ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.6వేల పెట్టుబడి సాయం జమచేస్తోందన్నారు. కరోనా సమయం నుంచి ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్నది బీజేపీ సర్కారే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు బల్ల శ్రీనివాస్, ఫరీదుల లింగరాజు, రాంకోటి, ధరావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చేవరకూ పోరాటం ఆగదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జనగామ రూరల్: జనగామలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చే వరకూ పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు కార్యకర్తలు, లబ్ధిదారులతో ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. జనగామలో ఎనిమిదేళ్ల నుంచి డబుల్‌బెడ్రూం నిర్మాణాలు పూర్తి చేయకపోవడమే కాకుండా స్థలాలు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే తొలగిస్తున్నారని అన్నారు. పనులు దొరక్క ఇబ్బందులు పడుతూ.. అద్దె ఇళ్లలో కాలం గడుపుతున్నారని, తక్షణమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి అందజేయాలని, లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసి ఆక్రమించుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సుగుణమ్మ, సాయన్న, జనార్దన్, సోమయ్య, ప్రశాంత్, విజయ, అరుణ, మల్లయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు 21 మంది గైర్హాజర్

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు సోమవారం 21 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. మొత్తం 363 మంది విద్యార్థులకు గాను 342 మంది హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ బైరి శ్రీనివాస్ తెలిపారు. ఆయన పలు సెంటర్లను సందర్శించారు.

నేటి నుంచి బీఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీఫార్మసీ (సీబీసీఎస్) 7వ సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 21నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 21, 23, 25, 27 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కేడీసీకి న్యాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్

పురాతన వైద్యం ఆయుర్వేదం

ఆన్‌లైన్‌లో పోస్టాఫీస్ ఖాతా

- వివరాలు 10లో▸

అంచనా బడ్జెట్ రూ.20.79 కోట్లు

- మిగులు, ఆదాయం రూ.12.49 కోట్లు
- క్యాపిటల్ గ్రాంట్స్ రూ.8.29 కోట్లు
- వ్యయం రూ.10.59 కోట్లు
- ఆస్తి పన్నుపై రూ.25 లక్షలు అదనం
- నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



జనగామ: మున్సిపల్ బడ్జెట్‌కు నేడు ఆమోద ముద్ర పడనుంది. గత ఏడాది మిగులుతోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లు కలుపుకుని భారీ బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. ఇందులో పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించే ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ముందు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.20.79 కోట్ల అంచనాతో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఇందులో ఆదాయం రూ.10.59 కోట్లు చూపిస్తుండగా(గత బడ్జెట్ కంటే రూ.83లక్షలు అదనం).. గత ఏడాది మిగులు రూ.1.90కోట్లు కలుపుకుని మొత్తం రూ.12.49 కోట్లుగా లెక్కించారు. కాగా క్యాపిటల్ ఆదాయం రూ.8.29కోట్లు వచ్చే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఇందులో నాన్‌ప్లాన్ గ్రాంట్స్ రూ.4.14కోట్లు, ప్లాన్ గ్రాంట్స్ రూ.1.35కోట్లు, ఇతర గ్రాంట్స్ రూ.2.80 కోట్లుగా చూపిస్తున్నారు.

రాబడి ఎలా..

మున్సిపల్ 2022-23 వార్షిక అంచనా, మిగులు బడ్జెట్ రూ.13.58 కోట్లకు ఆమోదించగా.. ఈసారి మిగులుతో కలుపుకుని రూ.12.49 కోట్లు అంచనా వేశారు. ఇందులో ఆస్తిపన్ను గత ఏడాది రూ.4.68 కోట్లు కాగా ప్రస్తుతం రూ.4.93 కోట్లు చూపిస్తున్నారు. నాన్ ట్యాక్స్ వనరుల ద్వారా రెమ్యునరేటివ్ ఎంటర్‌ప్రైజెస్ రెంటల్ ద్వారా గత ఏడాది రూ.66 లక్షలు ఉండగా, ఈ ఏడాది రూ.80లక్షలుగా అంచనా వేశారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్య విభాగం ద్వారా రూ.18 లక్షలు ఉండగా.. రూ.26లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా రూ.2.76 కోట్లు కాగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.3.07 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం రూ.1.47కోట్లు ఉండగా.. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1.51 కోట్లకు పెరిగింది.

ఖర్చు ఇలా..

గత ఏడాది కంటే ప్రస్తుత వార్షిక సంవత్సరం బడ్జెట్‌లో ఖర్చు పెరిగింది. ఇందులో ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు రూ.4.21కోట్లు, ప్రజారోగ్య, పారిశుద్ధ్యానికి సంబంధించి రూ.1.49కోట్లు, విద్యుత్ చార్జీలు రూ.1.14కోట్లు, రుణాల చెల్లింపులు రూ.1కోటి, గ్రీన్ బడ్జెట్‌కు 10శాతం నిధులు రూ.41 లక్షలు, ఇంజనీరింగ్ విభాగం నిర్వహణకు రూ.1.23కోట్లు, జనరల్ అడ్మినిస్ట్రేటివ్ రూ.70లక్షలు, పట్టణ ప్రణాళిక వ్యయం రూ.8.50లక్షలు, ప్రజా అవసరాలకు రూ.18.68లక్షలు, వార్డుల వారీగా పనులకు రూ.18.68 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉందని లెక్క వేశారు.

అసమ్మతి సభ్యులు హాజరవుతారా..!

మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, వైస్‌చైర్మన్ మేకల రాంప్రసాద్‌పై అవిశ్వాసం కోరిన అధికార పార్టీకి చెందిన 11 మంది, ప్రతిపక్ష పార్టీలోని 8 మంది కౌన్సిలర్లు నేటి బడ్జెట్ కౌన్సిల్ సమావేశానికి హాజరవుతారా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం బడ్జెట్ కాపీలను సభ్యులకు పంపించగా.. ఐదుగురు కౌన్సిలర్లు నిరాకరించినట్లు సమాచారం. బడ్జెట్ ఆమోదానికి కోరం లేని పరిస్థితుల్లో అధికారులు కలెక్టర్‌కు నివేదించనున్నారు.

నేడు బడ్జెట్‌కు ఆమోదం

మున్సిపాలిటీ 2023-24 వార్షిక అంచనా బడ్జెట్‌కు మంగళవారం నిర్వహించే కౌన్సిల్‌లో ఆమోదం తీసుకుంటాం. పూర్తి స్థాయి అధ్యయనం చేసిన తర్వాతే రూపకల్పన చేశాం. ఆదాయం, ఖర్చు, క్యాపిటల్ నిధులకు సంబంధించి బడ్జెట్ కాపీలో సవివరంగా పొందు పరిచాం.

- రజిత, మున్సిపల్ కమిషనర్

ఉత్తమ సేవలకు సత్కారం





కృష్ణవేణి, సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

జనగామ: స్పెషల్ సమ్మరీ రివిజన్-2023 ఆధార్ లింకేజీ 90 శాతానికిపైగా లక్ష్యం పూర్తి చేసిన ఘన్‌పూర్ ఈఆర్‌ఓ కృష్ణవేణి, రాయపర్తి ఉత్తమ బీఎల్‌ఓ కందికట్ల సురేష్‌కుమార్‌ను కలెక్టర్ శివలింగయ్య సత్కరించారు. వీరికి రాష్ట్ర ఎన్నికల సంఘం నగదు ప్రోత్సాహకంతోపాటు ప్రశంసాపత్రం అందజేసింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులకు దోలారోహణం..

పాలకుర్తి టౌన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవరం రాత్రి వసంతోత్సవం నిర్వహించారు. శివ పార్వతులు, లక్ష్మీనర్సింహస్వామి వారికి.. చేపట్టిన ఈ వేడుకను భక్తులు తిలకించి పులకించిపోయారు. అనంతరం ఉత్సవ మూర్తులకు డోలారోహణం నిర్వహించి ఆలయ ఆవరణంలో ఊరేగించారు. సదస్యం, పుష్పయాగం, పల్లకీసేవ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, ఈఓ రజనీకుమారి, అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భర్తపై హత్యాయత్నం

● ప్రాణాపాయ స్థితిలో ఉమేష్
● భార్యతో సహా నలుగురిపై కేసు



దేవరుప్పుల : ఓ భర్తపై భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. సోమవారం చిన్నమడూరులో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఎస్సై మునావత్ రమేష్ నాయక్ కథనం ప్రకారం.. చిన్నమడూరుకు చెందిన కూరాకుల ఉమేష్‌తో లింగాలఘణపురం మండలం కళ్లెంకు చెందిన మానుపాటి స్రవంతికి ఏడాది క్రితం వివాహమైంది. కొంత కాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతుండడంతో భార్య పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో భార్య స్రవంతి, తల్లిదండ్రులు రాములమ్మ, కుమార్, మేనమామలు ఎలేందర్, ఆంజనేయులు కలిసి సోమవారం ఉదయం ఉమేష్ ఇంటికి వచ్చి కత్తులతో దాడికి పాల్పడి గాయపర్చారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఉమేష్‌ను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కూరాకుల యాదయ్య ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

ఐక్య పోరాటాలు చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్: సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలని బీఎస్ ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి తాటికొండ మధు పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా జరిగిన భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన్‌పూర్‌లో లేబర్ అడ్డా ఏర్పాటు, అమావాస్య రోజు కార్మికులు పనులు బంద్ చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. సంఘం నిర్ణయించిన ధరల మేరకే అందరూ పనిచేయాలని సూచించారు. అనంతరం సీనియర్ నాయకులను సన్మానించారు. చింత జోజి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంజన్న, అనీల్‌కుమార్, శ్రీను పాల్గొన్నారు.

తేనెలొలుకు.. తెలుగు భాష

మాతృభాషకు గౌరవం పెంచుదాం..

● వక్తిత్వవికాసానికి తెలుగు తప్పనిసరి
● నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జనగామ : అమ్మఒడి మాతృభాష గొప్పదనాన్ని అందిస్తుంది. చిన్న తనంలోని కమ్మనైన జోల పాటలు... నీతి పద్యాలు పిల్లల ఎదుగుదలలో పొరులుగా తయారు చేస్తుంది. కానీ ఎక్కడ చూసినా యాంత్రిక విద్యకు ఇచ్చిన ప్రాధాన్యతను.. విలువలు నేర్పే మాతృభాష(తెలుగు)కు ఇవ్వడం లేదు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంతో పోటీ పడుతున్నామని మురిసిపోవడమే తప్ప... జీవిత పాఠాలు, క్రమశిక్షణ నేర్పించే మన మాతృభాష తెలుగును మరచిపోతున్నాం. దీంతో ఎన్నో రకాల దుష్ఫలితాలను సమాజం అనుభవిస్తున్నది. విలువైన విద్యను కాపాడగలిగే ప్రయత్నం చేస్తూ, మానవతా సిరులను మాతృభాష ద్వారా పెంపొందించగలగాలి. విద్య వ్యక్తిత్వాన్ని నేర్పించి, పది మందికి ఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దగలగాలి. నేటి ఆధునిక ప్రపంచంలో తనకు తాను గొప్పగా బతికితే చాలు, పది మంది జీవితం మాకెందుకు అనే ధోరణిలో చాలామంది ఉంటున్నారు.

మాతృభాష ఆదరణ తగ్గిందా...!

శ్రీకృష్ణదేవరాయల కాలంలో వెలుగు వెలిగిన తెలుగు భాషకి నేడు కొంత ఆదరణ తగ్గిందనే అనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం ఉన్నతమైన ఉద్యోగం సంపాదించాలంటే ఆంగ్లమే ప్రధానమనే భావన పాతుకుపోయింది. ఆంగ్లం అవసరం ఉన్నప్పటికీ, అదొక్కటే చాలదు. విషయ పరిజ్ఞానం అవసరం. మాతృభాష ద్వారానే అన్న సంగతి నేటితరం యువతీ, యువకులు అర్థం చేసుకోలేకపోతున్నారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఆంగ్లం అనర్గళంగా మాట్లాడే వ్యక్తులు వేలాదిగా కనిపిస్తారు. కానీ ఇందులో చాలా మందికి ఉన్నతస్థాయి ఉద్యోగాలు రావడం లేదు. ఎందుకంటే విజ్ఞాన సముపార్జన కలిగిన వారు మాత్రమే ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష బోధన ఉపకారం ఎంతో ప్రాధాన్యమైంది.



మాతృభాషను కాపాడుకునేందుకు సూచనలు

- పాఠశాలల్లో మాతృభాషకు ప్రాధాన్యత పెంచాలి.
- అమ్మ ఒడి నుంచి ఇంగ్లీష్ రైమ్స్‌తో పాటుగా, అంతకంటే ఎక్కువగా విలువైన తెలుగు బాలగేయాలను ప్రతి మాతృమూర్తి నేర్పగలగాలి.
- ప్రతి తెలుగు పౌరుడు, పౌరురాలు మాతృభాషను తమ శ్వాసగా చేసుకోగలగాలి.
- దుకాణాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మొదలైనవి తెలుగులోనే రాయాలి.
- తెలుగు భాషపై ఆసక్తిని పెంచే ఉపాధ్యాయుల ప్రయత్నానికి సహకరించాలి.

మాతృభాష గొప్పదనం తెలుసుకోవాలి



పిల్లల మానసిక వికాసానికి దోహదపడే మాతృభాషలోని నీతి కథలు, సూక్తులు, మంచి విషయాలు పిల్లలకు నేర్పించడం లేదు. ఆంగ్లంపై పెరుగుతున్న మోజుతో తల్లిదండ్రులతో పాటు విద్యాలయాల్లో సైతం మాతృభాషను కొద్దో గొప్పో మాట్లాడడం తప్ప... మెజార్టీ పిల్లలు తెలుగులో అమ్మా అని రాయలేకపోతున్నారు.

- త్రిపురారి పద్మ, తెలుగు పండిట్, రచయిత్రి, జనగామ

మాతృభాష మనిషికి ప్రాణవాయువు



ఆధునిక మానవ వికాసం ఊహలకు అందకుండా దూసుకుపోతోంది. నాగరికత కొత్త పుంతలు తొక్కుతోంది. మానవీయ బంధాలు క్రమంగా శిథిలమవుతున్నాయి. సెల్‌ఫోన్ పుణ్యమా అని తమ సమయాన్ని సోషల్ మీడియాకే కేటాయిస్తున్నారు. భాషా ప్రయోగంలో దేశీయత ఉట్టిపడేలా వర్తమాన రచయితలు తమ రచనల్లో కవితాభివృద్ధి కళా సుందరంగా ఉండేటట్లు ప్రయత్నించాలి.

- పానుగంటి రామమూర్తి అధ్యక్షుడు, తెలంగాణ రచయితల సంఘం

జీవన విధానానికి మూలాధారం..



మన సంస్కృతీ, సంప్రదాయాలు, జీవన విధానానికి మూలాధారం మాతృభాష అవసరం. మనిషి తన జీవితంలో ప్రయత్నంగా తల్లి ఒడి నుంచి నేర్చుకోవాలి, అమ్మ భాషను అమ్మను కాపాడుకున్నట్టే. ఇతర బాషలను నేర్చుకుంటూనే... తెలుగు భాషను గౌరవిద్దాం. భాషా పరిరక్షణకు ప్రాథమిక విద్య నుంచే విద్యా బోధన మరింత పటిష్టం కావాలి.

- వసంత, ఉపాధ్యాయురాలు, రచయిత్రి, జనగామ

మార్కెట్‌లోని సమస్యలు పరిష్కరించాలి

● ఏనుమాములలో కొత్త లైసెన్స్‌లు, మడిగెలను నిర్మించాలి
● మౌలిక వసతులు కల్పించాలి
● మార్కెటింగ్ డైరెక్టర్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కొత్త అడ్తి లైసెన్సుల జారీ, అపరాల షట్టర్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయిని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, అడ్తి కమీషన్, ఏజెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం పెంటయ్య, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మార్కెటింగ్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లోని ప్రాథమిక చికిత్స కేంద్రం విస్తరించి, టాయిలెట్స్‌ను నిర్మించాలని, అదే విధంగా ఛాంబర్‌కు గతంలో కేటాయించిన 35 గుంటల స్థలంపై ఉన్న లీజు తీసివేయాలని కోరారు. 194 క్యూ సెక్షన్‌తో అడ్తిదారుల నుంచి వసూలు చేస్తున్న టీడీఎస్ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. బార్దాన్ చెల్లింపుల కోసం ఖమ్మం వ్యవసాయం మార్కెట్‌లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించి వచ్చిన తర్వాత సమస్య పరిష్కారానికై సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇంటిగ్రేటెడ్ వేయింగ్ మిషన్లు పనిచేయడం లేదని, తగినన్ని అందుబాటులో లేకపోవడంతో రైతు సరుకుల తూకంలో జాప్యం జరుగుతోందన్నారు. తాము తెలిపిన అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించి ఒక నెల రోజుల్లో పైన వివరించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తానని మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి హామీ ఇచ్చినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.


మార్కెటింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చాంబర్ ప్రతినిధులు

లోన్ ఇస్తామని సైబర్ మోసం

● రూ. 1.15 లక్షలు కాజేత

స్టేషన్‌ఘన్‌పూర్: లోన్లు ఇస్తామని నమ్మబలికి మండలంలోని మీదికొండకు చెందిన మ్యాడారపు కేదారి బ్యాంకు అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1,15,224 కాజేసిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీదికొండకు చెందిన చిదురాల పద్మకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ప్రభుత్వం ద్వారా మీకు లోన్ వస్తుందని, మీ బ్యాంకు అకౌంట్ నంబర్, గుగూల్ పే, ఫోన్ పే నంబర్ ఇవ్వాలని అడిగాడు. ఇందుకు ఆమె తనకు బ్యాంకు ఖాతా లేదని, ఇంటి సమీపాన ఉండే మ్యాడారపు కేదారికి ఉందని, అతడికి ఫోన్ కలిపించి. దీంతో సైబర్ నేరగాడు ఫోన్‌కు ఒక లింకు పంపిస్తామని, దాన్ని క్లిక్ చేస్తే మీకు డబ్బులు అకౌంట్‌లో పడుతాయని నమ్మబలికాడు. దాంతో కేదారి తన ఫోన్‌కు, గుగూల్ పేకి వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా పలుమార్లు అతడి ఖాతా నుంచి మొత్తం రూ.1,15,224 కాజేసినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


మహబూబాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీసీపీ బారి, తదితరులు

● వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి
● జేఎన్‌ఎస్‌లో ముగిసిన వరంగల్ సిటీ బాస్కెట్‌బాల్ లీగ్

వరంగల్ స్పోర్ట్స్: క్రీడల్లో రాణిస్తే శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండడమే కాకుండా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి యువతను ఉద్దేశించి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండ్రోజుల పాటు జరిగిన వరంగల్ సిటీ బాస్కెట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీపీ బారి హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణతో అనుకున్న క్రీడల్లో సాధన చేస్తే ఉన్నత స్థానాలను చేరుకునేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. తాను కూడా క్రీడాకారుడిగా క్రీడా కోటలోనే పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించానని తెలిపారు. వ్యసనాలకు లోబడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సీనియర్ మెన్ కేటగిరీలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 10 జట్లు హాజరు కాగా.. విజేతగా మహబూబాబాద్ జట్టు, రన్నరప్‌గా వరంగల్ ఎల్‌బీ కాలేజీ జట్టు నిలిచింది. కాగా.. మూడోస్థానంలో జేఎన్‌ఎస్, కేసముద్రం జట్లు జాయింట్ విన్నర్స్‌గా నిలిచాయి. కార్యక్రమంలో కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి, వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎస్‌ఐ క్రాంతికిరణ్, డీఎస్‌ఏ బాస్కెట్‌బాల్ కోచ్ ప్రశాంత్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే భారీ చోరీ...

● 9 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు అపహరణ


చోరీకి గురైన ఇంట్లో విచారణ చేపడుతున్న ఏసీపీ, సీఐ

జనగామ: జనగామలో దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. సీఐ ఎలబోయిన శ్రీనివాస్, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వాసవీకాలనీ ఫేస్–2లో నివాసముంటున్న శివగారి కిరణ్, రజని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. రోజులాగే ఉదయం భార్యాభర్తలు స్కూల్‌కు వెళ్లాపోయారు. అదే ఇంట్లో పైఅంతస్తులో అద్దెకు ఉంటున్న ఉద్యోగి సైతం లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు..తలుపుకు వేసిన తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. స్కూల్ ముగిసిన తర్వాత సాయంత్రం 5 ఇంటికి వచ్చిన దంపతులు తలుపులు తీసి ఉండండతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల నిపుణలు పిలిపించి విచారణ చేపట్టారు. 9 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుల వాంగ్మూలం మేరకు ఫిర్యాదు స్వీకరించి విచారణ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

త్రైమాసిక పన్నులు వెంటనే చెల్లించాలి

● స్వచ్ఛందంగా చెల్లిస్తేనే పెనాల్టీలో రాయితీ ● ఎంవీఐ వెంకన్న


జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ వెంకన్న

ఖిలావరంగల్: ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలకు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని లేకుంటే 200 శాతం ఫెనాల్టీలు తప్పదని వరంగల్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వెంకన్న హెచ్చరించారు. వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ పురుషోత్తం ఆదేశాలు, వరంగల్ ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్ధిఖీ సూచనల మేరకు సోమవారం వరంగల్ రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. రహదారులపై ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ట్యాక్సీలు చెల్లించని వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఎంవీఐ వెంకన్న మాట్లాడుతూ ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలకు త్రైమాసిక ట్యాక్స్ చెల్లించకుండా యధేచ్ఛగా తిరుగుతున్న వాహనాలపై కొరఢా ఝుళిపించామని తెలిపారు. వాహన దారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్యాక్సీలు చెల్లిస్తే ఫైనాల్టీలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు.స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడితే 200 శాతం అదనంగా పెనాల్టీ కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ శాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

బోరు పంచాయితీ

● అటవీ అధికారులు, రైతు కుటుంబం మధ్య పోరాటం
● బోరులో రాళ్లు వేశారని ఆందోళన
● డీఆర్వోపై పోలీసులకు ఫిర్యాదు


పురుగులమందు డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతు కుటుంబం

బయ్యారం : మండలంలోని చర్లపల్లి సమీపంలోని వ్యవసాయ భూమిలో ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బోరు నీటివాడకంపై అటవీ అధికారులు, రైతు కుటుంబం మధ్య వివాదస్పదంగా మారింది. చర్లపల్లి సమీపంలో జగ్నాతండాకు చెందిన వాంకుడోత్ శ్రీను–వినోద దంపతులకు వారసత్వంగా 2.20 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో పంటలు సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆ భూమి సమీపంలో ఆరేళ్ల క్రితం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు పెంచేందుకు నర్సరీని ఏర్పాటు చేశారు. మొక్కల కోసం అవసరమైన నీటిని శ్రీను భూమిలో బోరును తవ్వి మోటార్ ద్వారా ఇరువురు వాడుకునే విధంగా మోటార్‌ను బిగించారు. కొన్నేళ్ల వరకు అటవీ అధికారులు, రైతు కుటుంబం మధ్య సఖ్యతగా కొనసాగిన బోరు నీటి వినియోగం సంవత్సర కాలంగా వివాదాలతో నడుస్తోంది. తమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్‌నీటిని వినియోగించొద్దని అటవీశాఖ డీఆర్వో నాగమణి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది బోర్ మోటర్‌తో పాటు వైర్లు, స్టాటర్‌ను తొలగించారు. దీంతో రైతు కుటుంబం కొత్తగా మోటార్, వైర్లు, స్టాటర్‌ను ఏర్పాటు చేసుకొని మొక్కజొన్న పంటకు నీరందిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఆర్వో తమ బోరు వద్దకు సిబ్బందితో వచ్చి అందులో రాళ్లు వేసిందని రైతు కుటుంబం పేర్కొంది. తమ బోరులో రాళ్లు వేసిన డీఆర్వోపై చర్యలు తీసుకోవాలని సోమవారం రైతు కుటుంబం బయ్యారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పురుగుల మందు డబ్బాతో ఆందోళన....

తమ బోరులో రాళ్లు వేసిన డీఆర్వోపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతు శ్రీను తన కుటుంబ సభ్యులతో కలిసి బయ్యారంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరగకపోతే పురుగుల మందు తాగుతామని పేర్కొనడంతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని వారించి పంపించారు. ఈ విషయంపై అటవీ అధికారులు మాత్రం తమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరుపై తమకే హక్కు ఉందన్నారు. కావాలనే రాద్ధాంతం చేస్తూ తమను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంటున్నారు.

పాముకాటుకు మహిళ మృతి

భూపాలపల్లి రూరల్: వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని గోర్లవీడులో చోటు చేసుకొంది. గ్రామస్తులు వ్యవసాయ కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షాజహాన్‌బీ(40) రోజువారీగా కూలీలతో కలిసి పత్తి ఏరడానికి వెళ్లింది, ఈ క్రమంలో పాము కరవడంతో తోటి కూలీలు చికిత్స నిమిత్తం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు తెలిపారు. మృతురాలకు భర్త లాల్ పాషా, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి..

ధర్మసాగర్: మండలంలోని ముప్పారం శివారులో గ్రానైట్ క్వారీలో కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నల్గొండ జిల్లాకు చెందిన ఆలకుంట్ల ఇద్దయ్య కొద్ది రోజుల క్రితం గ్రానైట్ క్వారీలో పని చేయడానికి వచ్చాడు. సోమవారం ఉదయం ఇద్దయ్య కాంప్రెషర్ ట్రాక్టర్‌తో గుట్టపైకి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో ఆయన ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పండుగకు వచ్చి.. అనంతలోకాలకు

● రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


శివ(ఫైల్)

సంగెం: మహాశివరాత్రి సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థి తిరిగి హాస్టల్‌కు వెళ్తూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం మాల్యాతండా శివారు పంచరాయి తండాకు చెందిన బానోత్ వెంకన్న–భారతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు నాగేశ్వరీ, రాజేశ్వరీ, కుమారుడు శివ ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకన్న కుమారుడు శివను పున్నేలు శివారు ఏకశిల పాఠశాలలో 4వ తరగతి చదివిస్తున్నాడు. మహాశివరాత్రికి సెలవు రావడంతో కుమారుడిని ఇంటికి తీసుకుని వచ్చారు. తిరిగి హాస్టల్‌లో దింపి రావడానికి తండ్రి వెంకన్న తన ద్విచక్ర వాహనంపై శివ (12)ను వెనుక కూర్చుండబెట్టి వెళ్తున్న క్రమంలో సంగెం మండలం గవిచర్ల దాటగానే ఓ కోళ్ల ఫారం సమీపంలో తూర్పుకోటకు చెందిన గోక వినయ్‌కుమార్ టాటాఏస్ గూడ్స్ వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వెనకాల కూర్చున్న శివ ఎగిరి రోడ్డుపై పడడంతో అతని తలపై నుంచి టాటాఏస్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి.



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

మిన్నంటిన రోదనలు

ఇద్దరు కూతుళ్లు జన్మించగా వారసుని కోసం ఎదురు చూస్తే మూడో సంతానంగా పుట్టిన కుమారుడికి శివ అని ముద్దుగా పిలుచుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివి కుటుంబాన్ని ఉద్ధరిస్తాడనుకుంటే అర్ధంతరంగా కానరాని లోకాలకు వెళ్లాడని, మంచిగా చదువుకుంటానని చెప్పి టాటా చెప్పి వెళ్లిన కాసేపటికే తిరిగిరాని లోకాలకు వెళ్లావా బిడ్డా అని తల్లితండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

● 50 కిలోల ఎండుగంజాయి పట్టివేత
● విశాఖపట్నం టు మహారాష్ట్ర తరలింపు
● రెండు కార్లు, బొలెరో ట్రక్ స్వాధీనం..
● ఐదుగురు నిందితుల అరెస్ట్, మరో నలుగురు పరార్
● వివరాలు వెల్లడించిన తొర్రూరు డీఎస్పీ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘు

మరిపెడ : మరిపెడ పట్టణం గుండా పెద్ద మొత్తంలో గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న స్థానిక సీఐ ఎస్.సాగర్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టారు. పట్టణ కేంద్రంలోని ఆర్‌జేఆర్‌ఎం కళాశాల మైదానంలో అనుమానితంగా ఉన్న వ్యక్తులకు పట్టుకొని రూ.7.50 లక్షల విలువ గల 50 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం పర్చుకున్నారు. ఎస్కార్ట్‌గా తరలిస్తున్న రెండుకార్లు, గంజాయి తరలిస్తున్న బొలెరో ట్రక్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మరిపెడ పోలీస్టేషన్‌లో తొర్రూర్ డీఎస్పీ వివరాలను సోమవారం వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా బోడుప్పల్ పీర్జాదిగూడ శంకర్‌నగర్‌కు చెందిన గంధసిరి నాగరాజు, చల్లమల్ల కంట్లమయ్య, నరేష్ వీరు ముగ్గురు కలిసి గతంలో నాగరాజుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మండలం రత్తంపేట శ్రీనివాస్‌కు పరిచయం ఉంది. ఈ పరిచయం కారణంగా అక్కడ శ్రీనివాస్‌తో కలిసి అన్నవరం దగ్గర కత్తిపూడి వద్ద రూ.5 వేలు కిలోగంజాయి చొప్పున 50 కిలోల ఎండు గంజాయిని సుమారు రూ.2.50 లక్షలకు కొనుగోలు చేసుకున్నారు. ఈ గంజాయిని నాగరాజుకు చెందిన టీఎస్ 07ఈయు7823 కారులో కొంత దూరం వరకు తరలించారు. దొరకకుండా ఉండేందుకు కొండ తేజ్‌కుమార్ బొలెరో ట్రక్‌ను కిరాయికి మాట్లాడుకున్నారు. ట్రక్‌లోని డ్రైవర్ సీటు వెనుకాల, క్యాబిన్ రూఫ్‌టాప్‌లో ప్రత్యేకంగా తయారు చేయించిన చాంబర్‌లో గంజాయి ప్యాకెట్లను లోడ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్ర తరలింపు..

మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా బర్సీకి చెందిన సంతోష్‌రాజ్ వ్యాపారితో ఎండుగంజాయిని కిలో రూ.15 వేల చొప్పున అమ్మడానికి బేరం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సదురు వ్యాపారి సంతోష్‌రాజ్ తన అనుచరులైన రామకృష్ణ మాధవరావు పోట్‌దార్, పాండురంగ్ సోమనాథ్ సోన్వనిలను హైదరాబాద్ నుంచి టాటా జెస్ట్ కారులో నిందితుడు నాగరాజుతో కలిసి వచ్చి మరిపెడ ఆర్‌జేఆర్‌ఎం కళాశాల వద్దకు ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటల సమయంలో చేరుకున్నారు. అప్పటికే అక్కడికి ఓ కారు, బొలెరో ట్రక్‌లో వచ్చిన చలమల్ల కంట్లమయ్య, నరేష్, కొండ తేజ్‌కుమార్, అంగడి రవిలను కలుసుకున్నారు. వ్యాపారం ఒప్పందంలో భాగంగా బొలెరో ట్రక్ నుంచి గంజాయి ప్యాకెట్లును హైదరాబాద్ నుంచి వచ్చిన టాటా జెస్ట్ కారులోకి మారుస్తున్న క్రమంలో పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో కొండ తేజ్‌కుమార్, నరేష్‌లు తప్పించుపోగా, మరో ఐదుగురిని వెంబడించి పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 7.50 లక్షల విలువ గల 50 కిలోల ఎండు గంజాయి. మూడు వాహనాలు స్వాధీనం చేసుక్నుట్లు తెలిపారు. పట్టుబడిన ఐదుగురిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కొండ తేజ్‌కుమార్, నరేష్, శ్రీనివాస్, సంతోష్‌రాజ్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ప్రధాన నిందితుడైన నాగరాజుపై గతంలో వివిధ ఆరు కేసుల్లో నిందితుడిగా పట్టుబడినట్లు తెలిపారు. సమావేశంలో మరిపెడ సీఐ ఎస్.సాగర్, ఎస్సైలు పవన్‌కుమార్, ఝాన్సీ, సంతోష, సిబ్బంది పాల్గొన్నారు.